ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి





ఇఫ్తార్ విందులో డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల్లా, దేవినేని అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

పటమట(విజయవాడతూర్పు): ముస్లింల అభ్యున్నతికి తమ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. లబ్బీపేటలో అల్ మున్నీర్ ఫౌండేషన్ అధినేత షేక్ మున్నీర్ అహ్మద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఇఫ్తార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ అన్ని రంగాల్లో మైనార్టీలకు ప్రభుత్వం స్థానం కల్పించిందని చెప్పారు. పాదయాత్రలో మైనార్టీల సమస్యలు తెలుసుకున్న జగన్ అధికారంలోకి రాగానే వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. మంత్రి పదవులు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లుగా మైనార్టీలకు అవకాశం కల్పించిన ఏకైక ప్రభుత్వమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాల్సిన బాధ్యత ముస్లింలపై ఉందన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ రుహుల, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ముస్లిం ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసీఫ్, వైఎస్సార్ సీపీ తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్, హజ్ కమిటీ చైర్మన్ ఘౌసల్ అహ్మద్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ మెహబూబ్ షేక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



భవానీపురం(విజయవాడపశ్చిమ):వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని విజయవాడ మెడికల్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు తెలిపారు. మానవతావాది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గొల్లపూడి గ్రామంలోని అంబేడ్కర్ నగర్‌లో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడుతూ ఎండలు మండుతున్న క్రమంలో వివిధ పనులపై ఇంటి నుంచి బయటకు వచ్చిన వారు దాహం తీర్చుకునేందుకు ఎదురు చూసే ప్రజల కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు అభినందనీయులన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారి పక్కనే ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం వలన రహదారి వెంబడి రాకపోకలు సాగించే వారికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆర్. గోపాలం, ఎం.నరసింహారావు, డి.నాగేశ్వరరావు, ఎం.సంగీతరావు, జి.రత్నరాజు, కేజేఎస్ ప్రకాష్ పాల్గొన్నారు.

సన్‌సిరి ప్రాజెక్ట్స్ బ్రోచర్ ఆవిష్కరణ



పెనమలూరు: విజయవాడ సన్‌సిరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పెనమలూరులో నూతన వెంచర్ ప్రారంభించింది. ఈ మేరకు శనివారం సంస్థ కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరించారు. సంస్థ చైర్మన్ భాష్యం అప్పారావు మాట్లాడుతూ ఇప్పటివరకు ఏపీసీఆర్‌డీఏ అప్రూవల్‌తో వేసిన వెంచర్లు కష్టమర్ల సహకారంతో విజయవంతంగా అమ్మకాలు చేశామన్నారు. ఇప్పుడు బందరు రోడ్డుకు దగ్గరలో కొత్తగా వేసిన వెంచర్ 40, 60 అడుగుల బీటీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ ట్యాంకు, తక్షణం గృహాలు నిర్మాణం చేసుకునే విధంగా 25 ఎకరాల్లో ప్లాట్లు వేశామని వివరించారు. భాష్యం రాజేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు గంగూరు, ఈడుపుగల్లు, ముస్తాబాద్, కంకిపాడు ప్రాంతాల్లో వెంచర్లు వేశామన్నారు.

చెస్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ సిద్ధార్థ నగర్‌లోని గ్లోబల్ చెస్ అకాడమీలో చదరంగం వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కస్టమ్స్ జాయింట్ కమిషనర్ నూతలపాటి సౌమ్య ఈ తరగతులను శనివారం సాయంత్రం ప్రారంభించారు. చిన్నారుల్లో మేధో శక్తిని పెంచేందుకు, భవిష్యత్తులో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు చదరంగం దోహదపడుతుందని సౌమ్య చెప్పారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ పదో తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని అకాడమీ కార్యదర్శి షేక్ ఖాసీం తెలిపారు. గడిచిన 19 ఏళ్లలో నిర్వహించిన కోచింగ్ క్యాంపుల ద్వారా 12 వేల మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. తమ అకాడమీలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై రాణించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అకాడమీ వైస్ ప్రెసిడెంట్ బుద్ధరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం వెలకట్టలేనిది

- బాలసదన్‌లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు
- ప్రారంభించిన కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు



బాల సదన్‌లో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అనాథ బాలలను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలో నిర్వహిస్తున్న బాలసదన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కోస్టల్ బ్యాంక్ రూ. 1.50 లక్షల విరాళం అందించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ బాలలకు అండగా ముందుకు వస్తున్న దాతల సహకారం వెలకట్టలేనిదన్నారు. వీధి బాలలు, అనాథలు, పేద బలహీన వర్గాల పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటుందని చెప్పారు. దీనికి తోడు దాతల సహకారం కూడా ఉంటే వారికి విద్య, వైద్యం అందించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. చిన్నారులకు సురక్షితమైన మంచినీటిని అందించేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన కోస్టల్ బ్యాంకు అధికారులను అభినందించారు. గతంలో బాలసదన్‌లో ఆశ్రయం పొందిన చిన్నారులకు బార్ అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చి పుస్తకాలు, దుస్తులు అందించారని పేర్కొన్నారు. సదన్‌లో పెయింటింగ్స్ వేయించడం, వేడి నీటి సౌకర్యం కోసం గ్రీజర్, బట్టలు శుభ్రపరచుకునేందుకు వాషింగ్ మిషన్లు బహుకరించారన్నారు. బాల సదన్ చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తూ పూర్తి పర్యవేక్షణ చేస్తున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ రాధాకుమారిని అభినందించారు. చిన్నారులకు అవసరమైన దుస్తులు తయారు చేసుకునేందుకు న్యాయవాది వి. వనదుర్గ రూ. 70 వేల విలువగల కుట్టుమిషన్లు, రోటరీ క్లబ్ సభ్యులు మిఠాయిలు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు. వీరి స్ఫూర్తితో అనాథలను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి, కోస్టల్ బ్యాంకు ఏజీఎం జె. ఎస్ ఆర్ అంజనేయులు, మేనేజర్ వి. రామకృష్ణ, బాల సదన్ పర్యవేక్షకురాలు జోత్స్న, వసతి గృహ పర్యవేక్షకురాలు వి. సూర్యకుమారి సీడీపీఓలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళా విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా దిగువ పేర్కొన్న ప్రాంతాలలో రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళానగర్, జోజినగర్, లలితానగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, వంగవీటి మోహన రంగా (సితార) జంక్షన్, లేబర్‌కాలనీ, మిథిలానగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్ తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆస్తిలో వాటా ఇవ్వాలని తల్లిపై కుమారుడి దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి వాటా ఇవ్వాలని తల్లిపై దాడి చేసిన కుమారుడిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అంజనేయ వాగు సెంటర్ వద్దెర కళ్యాణ మండపం ప్రాంతంలో బొంత లక్ష్మమ్మ నివాసం ఉంటుంది. లక్ష్మమ్మకు ఇద్దరు సంతానం. భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటుంది. కుమారుడు అశోక్ తాపీ పని చేస్తుంటాడు. గతంలో అశోక్ తల్లిని ఇంటిలో నుంచి వెళ్లిపోవాలని వేధించడమే కాకుండా కొట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మమ్మ కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన లక్ష్మమ్మ వద్దకు వెళ్లిన అశోక్ తనకు ఇంటిలో వాటా ఇవ్వాలని వేధింపులకు గురి చేయడమే కాకుండా దాడి చేసి కొట్టాడు. దీంతో లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రంజాన్ మాసం చాలా పవిత్రమైనది

ఎమ్మెల్యే వెలంపల్లి



షాహీ మసీదులో జరిగిన ఇఫ్తార్‌లో పాల్గొన్న వెలంపల్లి తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముస్లింలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 54వ డివిజన్ కార్పొరేటర్ అర్షద్ ఆధ్వర్యంలో స్థానిక షాహీ మసీదు ప్రాంగణంలో ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెలంపల్లి శ్రీనివాసరావు ముస్లింలతో కలిసి ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాస దీక్షలను ఆచరించి భగవంతుని ధ్యానలో సమయాన్ని గడిపి ఎంతో గొప్ప ఫలితాన్ని పొందుతారన్నారు. షాహీ మసీదు ప్రాంగణంలో ఇఫ్తార్‌ను నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ రంజాన్ మాసం అందరికీ మేలు చేయాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వివరించారు. వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్ ఇర్ఫాన్, నాయకులు వాహబ్, సలీమ్, ఖాదర్, అతీక్, మసీదు కమిటీ కార్యదర్శి ఇంతియాజ్ వారికి స్వాగతం పలికారు.

సూర్యసత్య ట్రస్ట్ సేవలు అభినందనీయం



మజ్జిగను పంపిణీ చేస్తున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సూర్య సత్య చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో కేటీరోడ్డు సాయిరాం థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ రాయన భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. సూర్యసత్య ట్రస్ట్ పేదలకు ఉచిత వైద్య శిబిరాలతో పాటు పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఆర్థిక సాయాలను అందిస్తుంటారన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. ట్రస్ట్ చైర్మన్ రాజగిరి సోమేశ్వరరావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చలివేంద్రం ప్రారంభంను పురస్కరించుకుని 1500 మంది ఆటో డ్రైవర్లు, రిక్షా పుల్లర్లు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసే వారికి మజ్జిగ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. పాదచారులకు, వాహన చోదకులకు మజ్జిగఅందచేశారు. కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్, ట్రస్ట్ డైరెక్టర్ రాజగిరి భాస్కరరావు, బెవర సూర్యనారాయణ, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నల్లాని సూర్యారావు, శివకుమార్ పట్నాయక్, ఏపీ నగరాల సంఘం అధ్యక్షులు బాయన బాబ్జీ, సత్యసాయి బాబా సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ శేఖర్‌సాయి, శీరం వెంకట్రావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అవగాహనతోనే అగ్ని ప్రమాదాలు నివారించడం సాధ్యమవుతుందని కొత్తపేట అగ్నిమాపక కేంద్రం అధికారి తలశిల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం వైఎస్సార్ కాలనీ, సాయిరాం థియేటర్ సెంటర్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో తొలుత ర్యాలీ నిర్వహించారు. గ్యాస్, కరెంటు వల్ల జరిగే ప్రమాదాలను ఏ విధంగా అరికట్టవచ్చుననే దానిపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో ఎక్కువగా కరెంటు, గ్యాస్‌తోనే ప్రమాదాలు జరుగుతాయని, అటువంటి సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



బాలుడి తల్లికి నగదు సాయం అందచేస్తున్న శ్రీకాంత్

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్యాన్సర్ బాధిత బాలుడి కుటుంబానికి ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని అందచేశారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోగల ఆయన కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ గుణదలకు చెందిన బంగారు తేజాచారి-స్వర్ణ దంపతుల కుమారుడు చిన్నారి యశ్వంత్ కుమార్ మూడవ తరగతి చదువుతున్నాడని, దురదృష్టవశాత్తు ఆ బాలుడు క్యాన్సర్ వ్యాధికి గురై చికిత్స పొందుతున్నాడని తెలిపారు. విషయం తెలుసుకున్న విశ్వ సాయి టౌన్‌షిప్ ఎండీ గుణాల కృష్ణ హేమంత్ అందించిన ఆర్థిక సహాయాన్ని తన ద్వారా బాలుడి కుటుంబసభ్యులకు అందచేశామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలతోపాటు బాధిత బాలుడి వైద్యానికి స్వచ్ఛంద సంస్థలు, మనసున్న వ్యక్తులు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు. గుణదల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జవ్వాది సుధీర్, నగర కార్యదర్శి పూసులూరి దుర్గా ప్రసాద్, నాయకులు కోసూరి రమేష్, చిప్పాడ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేసేందుకే నవరత్నాలు

ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



నేషనల్ ఫెలోషిప్ అవార్డులు అందుకున్న వారితో ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కొన్ని పత్రికలు ప్రజల మనసులను కలుషితం చేయడానికి కంకణం కట్టుకుని పనిచేస్తున్నాయని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు విమర్శించారు. శనివారం విజయవాడ ఐలాపురం కన్వెన్షన్‌లో ఫిలిం ట్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి నేషనల్ ఫెలోషిప్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కొమ్మినేని మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, వాటిలోని లోపాలను విమర్శిస్తే తప్పులేదన్నారు. కానీ అలా కాకుండా ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని అడ్డంగా విమర్శించడం దురదృష్టకరమన్నారు. గతంలో ఇటువంటి పరిస్థితి తానెప్పుడు చూడలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై కక్షతో ఈ రాష్ట్ర ప్రజలపైన కక్ష తీర్చుకుంటున్నారేమోనని తాను భావిస్తున్నానన్నారు. పేదలకు మేలు చేసేందుకు ప్రభుత్వం నవరత్న పథకాలు అమలు చేస్తుంటే అది నాశనం అన్నట్లు చిత్రీకరిస్తున్నారన్నారు. పేదల పిల్లలు చదువుకుంటే నాశనమా? ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే అది విధ్వంసమా? అని ప్రశ్నించారు. తెలుగు మీడియమే గొప్పదని ప్రచారం చేస్తున్న ప్రముఖుల పిల్లలు ఏ ఒక్కరైనా తెలుగు మీడియంలో చదువుతున్నారా? ప్రభుత్వ బడులలో చదువుతున్నారా ?అని నిలదీశారు. కొన్ని పత్రికలు తామే ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వంపై దండోర ప్రకటించి తమ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలు పొందుతున్నాయని ధ్వజమెత్తారు. బలహీనవర్గాలకు ఇంత అండగా నిలిచిన ప్రభుత్వాన్ని గతంలో తానెప్పుడూ చూడలేదన్నారు. అనంతరం వివిన్న రంగాల్లో కృషి చేసిన పలువురు ప్రముఖులకు గౌతమ బుద్ధ, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయిపూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ పేర్లతో నేషనల్ ఫెలోషిప్ అవార్డులను అందజేశారు. ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, ఫిలం ట్రోఫిక్ సొసైటీ వ్యవస్థాపకులు అద్దంకి రాజ, మేదర సురేష్, శ్రీ శ్రీ కళా వేదిక సమన్వయకర్త కొల్లి రమాదేవి, డాక్టర్ గూటం స్వామి, జల్లి విక్టర్ పాల్గొన్నారు.

యుగంధరాచార్యకు సన్మానం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించినందుకు పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు ఆయనను శనివారం సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేబీఎన్ కళాశాల తెలుగు భాషా ఉపన్యాసకులు డాక్టర్ జేవీ చలపతిరావు మాట్లాడుతూ యుగంధరాచార్య జ్యోతిష్యంలో లక్ష మంది హస్త ముద్రికలను చూసిన సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారన్నారు. ఈ గుర్తింపు విజయవాడకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల సహాయ కార్యదర్శి కూరపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

కొఠారికి అభినందనలు

వన్‌టౌన్: ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషాను ఏపీ స్టేట్ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి శనివారం సాయంత్రం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. మైనార్టీ సంక్షేమ శాఖకు అనుబంధంగా ఉన్న ఏపీ జైన్ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా నియమితులైన మనోజ్‌కొఠారి సంబంధిత శాఖ మంత్రి అంజాద్‌బాషాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

పాలిటెక్నిక్, APRJC, IIIT ఎంట్రన్స్ కోచింగ్
క్లాసులు ప్రారంభం: 17-04-2023
గత 15 సం.ల అనుభవము
By Experienced Lecturers
III to X అడ్మిషన్లు జరుగుచున్నవి
బెజవాడ రాజారావు హైస్కూల్
అరవిందవీధి, విద్యాధరపురం, విజయవాడ-12.
ఫోన్: 0866-2411914, 94402 80263.

ఇఫ్తార్ విందుకు విచ్చేయండి

ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా




మోతీ మసీదు పెద్దలతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ విందుకు ముస్లింలందరూ విచ్చేయాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా కోరారు. చిట్టినగర్ మోతీ మసీదు, షాదీఖానాలో శనివారం నమాజుకు విచ్చేసిన ఆయన ముస్లిం పెద్దలతో మాట్లాడారు. నమాజులో పాల్గొన్న అనంతరం మసీదు కమిటీతో సమావేశమయ్యారు. ప్రభుత్వం తరుపున ఇస్తున్న ఇఫ్తార్‌కు అందరూ విచ్చేసేలా చూడాల్సిన బాధ్యత కమిటీకి అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ముస్లిందరికీ తెలియజేస్తామని ఇమామ్ నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. మోతీ మసీదు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖాజా, ఇషాక్ అలీ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్. మొహమ్మద్‌రాజ్, రషీద్, షేక్. బాషా, బడేలతో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

బంగారపు వస్తువులు చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వలంటీర్ ఇంట్లో 8 కాసుల బంగారం, రూ. 2 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట సుబ్రహ్మణ్యస్వామి గుడి ప్రాంతంలో శీలం వరలక్ష్మి, శ్రీనివాస్ దంపతులు నివాసం ఉంటున్నారు. వరలక్ష్మి 181వ సచివాలయంలో వలంటీర్‌గా ఉద్యోగం చేస్తుండగా, భర్త శ్రీనివాస్ తణుకులోని ఓ బ్యాంక్‌లో గుమస్తాగా ఉద్యోగం చేస్తుంటాడు. శనివారం ఉదయం శ్రీనివాస్ ఉద్యోగానికి వెళ్లగా, వరలక్ష్మి పిల్లలను స్కూల్‌కు పంపి ఇంటికి తాళాలు వేసి డ్యూటీకి వెళ్లింది. చిన్న కుమార్తె కార్తీకకు ఒంటి పూట స్కూల్ కావడంతో మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చేసింది. ఇంటి తలుపులు తెరిచి ఉండటమే కాకుండా బీరువాలో సామగ్రి చిందర వందరగా పడి ఉండటంతో వెంటనే తల్లికి ఫోన్ చేసింది. వరలక్ష్మి ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉండాల్సిన నల్లపూసల గొలుసు, లక్ష్మీదేవి ఉంగరం, మరో ఉంగరం, చెవిజూంకాలు, రెండు కాసుల బంగారపు చైను, రూ. 2 వేల నగదు కనిపించలేదు. వరలక్ష్మి ఇంటికి తాళాలు వేసి ఆ తాళం చెవులను ఇంటి బయట ఉన్న బూట్లలో పెడుతుంటుంది. అయితే ఈ విషయం తెలిసిన వారే బంగారం చోరీకి పాల్పడిన ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం రంగంలోకి దింపింది. నిందితుల వేలి ముద్రల కోసం ప్రయత్నించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.


అన్నమయ్య పదాలు తెలుగు భాషా వీచికలు



అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న శ్రీదేవి బృందం

విజయవాడ కల్చరల్: తాళ్ళపాక అన్నమాచార్య పదాలు తెలుగుభాషా వీచికలని భాషా సాంస్కృతిక, సామాజిక అంశాల సమాహరమని అన్నమయ్య పరివార్ వ్యవస్థాపకుడు యనమండ్ర వేంకటకృష్ణయ్య అన్నారు. అన్నమయ్య పరివారం, ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాల త్రిపుర కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో అన్నమయ్య పదాలతో తిరుపతి యాత్ర భక్తి సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదకవితకు ఆద్యుడు అన్నమయ్య అని కొనియాడారు. ఆయన సంకీర్తనలు భక్తి, భావ రాగ, తాళ యుక్తంగా ఉంటాయన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమయ్య సంకీర్తనలకు ప్రచారం కలిగిస్తోందన్నారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ తెలుగు సాహిత్యంలో అన్నమయ్య పద వైభవం అంశంగా ప్రసంగించారు గాయని ఎస్‌పీ శ్రీదేవి అన్నమయ్య సంకీర్తనలు మధురంగా గానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, ఆర్ కల్యాణ్ కుమార్, పి.పాండురంగారావు వాద్య సహకారం అందించారు.

అయ్యప్పస్వామికి పంచామృత అభిషేకాలు



అభిషేకాల అనంతరం అయ్యప్ప స్వామి వారికి విశేష అలంకరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేరళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కొత్తపేట అంజనేయవాగు సెంటర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వీరాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి వారికి తెల్లవారుజామున సుప్రభాత సేవ చేశారు. ఉదయం 7 గంటలకు ఆలయ అర్చకులు విస్సకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో పంచామృత అభిషేకాలు నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు, చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యవర్గ సభ్యులు తొత్తడి సుబ్రహ్మణ్యం, రాంపిళ్ల సూరిబాబు, మేదర రామకృష్ణ, శ్రీకాంత్, శ్రీనివాసరావు, కనకారావు, విజయ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వేడుక వివాహ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ వెస్ట్:
90102 10386
Office mail : sakshiads@gmail.com

ప్రకటన

మా క్లయింటులైన కృష్ణాజిల్లా, విజయవాడ వాస్తవ్యులైన [illegible] జైన్ గారి కుమార్తెలైన [illegible] సంబంధించి అందరికి తెలియజేయునది.

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని విజయనగరం జిల్లా విజయనగరం వాస్తవ్యులైన [illegible] 21-10-1952వ తేదీగల విజయవాడ [illegible] 2258/1952 [illegible] 15-5-1956వ తేదీన [illegible] 1417/1956 [illegible] 13-1-2015 [illegible] 5-3-2018న [illegible] 1861/2018 [illegible] 10 రోజుల లోగా [illegible]

షెడ్యూలు: కృష్ణాజిల్లా, విజయవాడ [illegible] పాత డోర్ నెం. 8/219, ప్రస్తుత డోర్ నెం. 9-66-34, [illegible] నెం. 51281 [illegible] 201.3 [illegible] తూర్పు: [illegible] 57.10 [illegible]; దక్షిణం: మున్సిపల్ రోడ్డు 31.1 [illegible]; పడమర: [illegible] - 57.10 [illegible]; ఉత్తరం: [illegible] - 31.4 [illegible]. [illegible]

సి. హెచ్. దామోదరరావు, బి.వి. శ్రీనివాస్, యస్.బి.వి. [illegible], శ్రీమతి పి.రేఖ, వి.యస్.ఎల్.మాధుర్య, [illegible]
11-11-8, [illegible] విజయవాడ. 9393999545